సాక్షి పెద్దపల్లి

సోమవారం। 21। ఆగస్టు। 2023



రాజన్న సేవలో ఎమ్మెల్యే

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆదివారం కుటుంబసమేతంగా వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. అర్చకులు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.



కొండపై పూజలు

కొండగట్టు : శ్రీఆంజనేయస్వామి ఆలయంలో నాలుగోరోజు ఆదివారం శ్రావణ సప్తహ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి



మంత్రి ఈశ్వర్

ధర్మారం(ధర్మపురి): జిల్లాలో ప్రబలుతున్న సీజన్ వ్యాధుల నుంచి ప్రజలను కాపాడేందుకు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదివారం జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రజలు ఆందోళన చెందకుండా వైద్య సిబ్బంది తగు చికిత్స చేస్తూ భరోసా కల్పించాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ వైద్యుల సలహాలు పాటించాలన్నారు. పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల కలెక్టర్‌లు సకాలంలో స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదన్నారు.

27 వరకు ప్యాసింజర్ రైళ్లు రద్దు



రామగుండం: కాజీపేట– బల్లార్ష మధ్య నడిచే రామగిరి, పుష్‌పుల్, సింగరేణి రైళ్లను ఈనెల 27 వరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు పేర్కొన్నారు. మూడో రైల్వేట్రాక్ సాంకేతిక పనుల నిమిత్తం రద్దు చేస్తున్నట్లు వివరించారు. కాగా ఈనెల 10 నుంచి 20 వరకు రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన అధికారులు మరో వారం పొడిగించడంపై గ్రామీణ ప్రయాణికులు అధికారుల వైఖరిపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలకు లేని అడ్డంకులు ప్యాసింజర్ రైళ్లకు ఎందుకు వర్తింపజేస్తున్నారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా బల్లార్షా నుంచి కొత్తగూడెంకు ఒకటే సింగరేణి ప్యాసింజర్ రైలు నడుస్తుండగా, సింగరేణి కార్మికులు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. సదరు రైలును రెండు మాసాలుగా తరచూ రద్దు చేస్తున్న రైళ్ల జాబితాలో చేర్చడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం ఆలస్యంగానైనా ప్యాసింజర్ రైళ్లను నడిపిస్తే సాధారణ, మధ్య తరగతి ప్రయాణికులకు అనుకూలంగా ఉంటుందని కోరుతున్నారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థిని ప్రతిభ



ఆనంది

కమాన్‌పూర్(మంథని): కమాన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన నల్లవెల్లి ఆనంది ఇటీవల హైదరాబాద్ గోల్కొండలో నిర్వహించిన అండర్–14 అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించింది. ఆనంది ఆదిలాబాద్ స్పోర్ట్స్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది.

కాంగ్రెస్‌తోనే యువతకు ఉద్యోగావకాశాలు



పార్టీలో చేరినవారితో మక్కాన్‌సింగ్

రామగుండం: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే మైనార్టీలు, యువతకు ఉద్యోగావకాశాలు వస్తాయని, దొపిడీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో చరమగీతం పాడాలని డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ అన్నారు. ఆదివారం రామగుండం పట్టణ పరిధి ఒకటవ డివిజన్‌లోని వివిధ పార్టీలకు చెందిన యువత కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కాగా పార్టీలో యువత చేరేందుకు కృషి చేసిన మాజీ కౌన్సిలర్ ఇసంపెల్లి అంజులు, బల్వాన్‌సింగ్‌ఠాకూర్‌లను మక్కాన్ అభినందించారు. పార్టీలో చేరినవారిలో సతీశ్, సమ్మయ్య, మహేశ్ తదితరులు ఉన్నారు.

నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కష్టపడాలి



మాట్లాడుతున్న అస్సాం ఎమ్మెల్యే సుశాంత్

మంథని: రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాబోతుందని, మంథనిలో మరింతగా కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కష్టపడితే విజయం సొంతమవుతుందని అస్సాం ఎమ్మెల్యే సుశాంత్ అన్నారు. ప్రవాసి ఎమ్మెల్యే సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మంథనిలో జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డితో కలిసి పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. జిల్లా పరిషత్ చైర్మన్ అవినీతి చిట్టా, ఎమ్మెల్యే అసమర్థ పాలనను నిలదీయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రావు, కో కన్వీనర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల జాబితాలో అనర్హులు?

- ఇంకా కొలిక్కి రాని పరిహారం
- గతంలో రూపొందించిన జాబితాలో పేర్లు గల్లంతు
- అధికారుల వైఖరిపై విమర్శలు గుప్పిస్తున్న నిర్వాసితులు



ఇతడి పేరు దుప్పటి రాకేశ్. ముర్మూర్ పునరావాసకాలనీ. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్వాసితుడు. 2015 జనవరి నాటికి ఇతడికి 19 ఏళ్లు నిండాయి. 2019లో కరోనాకు ముందు అధికారులు గ్రామాల్లో పర్యటించినప్పుడు నిర్వాసితుడిగా పరిహారం అందించేందుకు ఇతడి పేరు జాబితాలో ఎక్కించారు. అప్పుడు కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం కొనసాగుతున్న క్రమంలో అధికారులు చదివి వినిపించిన జాబితాలో సైతం ఇతడి పేరు ఉంది. ఆ తర్వాత కరోనాతో రెండేళ్లు అధికారిక పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం కొత్త జాబితాలో తన పేరు లేదని వాపోయాడు.



ఎల్లంపల్లి పునరావాస గ్రామం

రామగుండం: పుష్కరకాలం క్రితమే ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్వాసితులను పునరావాసకాలనీకి తరలించి ప్రాజెక్టులో నీటిని నింపుతున్నారు. అప్పటి నుంచి నేటి వరకు ఇంకా ఎల్లంపల్లి భూనిర్వాసితులకు పరిహారాల పంపిణీ కొలిక్కి రాకపోవడం దురదృష్టకరం. ఐదేళ్ల క్రితం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారాల ప్రక్రియ వందశాతం పూర్తి చేశారు. కానీ ఎల్లంపల్లి నిర్వాసితులకు మాత్రం పునరావాస ప్యాకేజీ చెల్లింపుల్లో ఏళ్లుగా తీవ్ర జాప్యం జరుగుతోంది.

సర్వే చేసినా అందని పరిహారం

2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వాసిత గ్రామాల్లో సోషియో ఎకనామిక్ సర్వే చేపట్టింది. ఈ నేపథ్యంలో సోషియో ఎకనామిక్ సర్వేలో పేర్కొన్న విధంగా 2015 జనవరి నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు పునరావాస ప్యాకేజీ వర్తింపజేయాలని స్పష్టం చేసింది. కాగా గడిచిన ఎనిమిదేళ్ల కాలంలో బదిలీపై వచ్చిన కలెక్టర్లు తరచూ ఇప్పటికే నాలుగు సార్లు క్షేత్రస్థాయి సర్వే చేపట్టి అర్హుల జాబితాను రూపొందించినా పరిహారం పంపిణీకి మాత్రం నోచుకోలేదు.

సర్వేలో తేడాలు

నిర్వాసిత గ్రామాల్లో 2019, 2023లో చేపట్టిన సర్వేల్లో తేడాలు వెలుగుచూశాయి. ఎల్లంపల్లి, ముర్మూర్ రెండు నిర్వాసిత గ్రామాల్లో 2019లో చేపట్టిన అర్హుల జాబితాలో 348 మంది కాగా, 2023లో రూపొందించిన జాబితాలో 264 మంది, పొట్యాలలో 2019లో 130 మంది కాగా ప్రస్తుతం 334 మంది, మద్దిర్యాలలో 2019లో 75 కాగా ప్రస్తుతం 70 మందిని లబ్ధిదారులుగా గుర్తించారు. అర్హుల జాబితా ఎంపికలో ప్రజాప్రతినిధులు, అధికారులు చేతివాటం ప్రదర్శించడంతోనే నిజ మైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా పునరావాస పరిహా రాల పంపిణీ పై వస్తున్న ఆరోపణలపై అంతర్గాం తహసీల్దార్ రామ్మోహన్‌రావును 'సాక్షి' వివరణ కోరగా అందుబాటులోకి రాలేదు.

ఆందోళనలకు సిద్ధమే..



2019లో రూపొందించిన జాబితాలో నా పేరు ఉంది. ఆ సమయంలో పరిహారం అందజేస్తామని అధికారులు పేర్కొంటూ మా ధ్రువీకరణపత్రాలు అందజేయాలని కోరారు. వయసుకు సంబంధించిన అన్ని ఆధారాలు అందజేశా. పునరావాస ప్యాకేజీ చెల్లించేందుకు అర్హుడిగా గుర్తించారు. ఇప్పటి జాబితాలో నా పేరు లేదు. నాకు ప్యాకేజీ రాకుంటే ఎంతటి ఆందోళనలకైనా సిద్ధంగా ఉన్నా.

– గొట్ట రాజ్‌కుమార్, ఎల్లంపల్లి నిర్వాసితుడు

నూతన జాబితా ప్రదర్శించాలి



అధికారులు పునరావాస గ్రామాల వారీగా రూపొందించిన అర్హుల జాబితాను గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించాలి. అలాగే పరిహారాలు అందజేసే క్రమంలో గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేసి ప్రజల సమక్షంలో అర్హులకు అందజేయాలి. అప్పటికప్పుడే ప్రజల సమక్షంలో అసలైన అర్హులకు న్యాయం జరుగుతుంది. కేవలం జాబితా ప్రకారం సదరు వ్యక్తుల బ్యాంకు ఖాతాలకు పరిహారం జమచేస్తే ఆందోళనలు చేస్తాం.

– ఉరిమెట్ల రాజలింగం, మాజీ ఎంపీపీ, ముర్మూర్

లక్కీడ్రాప్ ఎవరికో?

- నేడు తేలనున్న వ్యాపారుల భవితవ్యం
- గతంకన్నా భారీగా పెరిగిన దరఖాస్తులు
- 290షాపులకు 10,730 దరఖాస్తులు
- అత్యధికంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో..



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: వైన్‌షాపుల లక్కు ఎవరిని వరిస్తుందోనని మద్యం వ్యాపారుల్లో టెన్షన్ మొదలైంది. లాటరీ ద్వారా ఎంపికకు మరికొద్ది గంటల సమయమే ఉంది. ఈక్రమంలో దీనిపై చర్చ జోరుగా సాగుతోంది. ఈసారి దరఖాస్తు ఫీజు రూ.2లక్షలుగా నిర్ణయించారు. దీంతో భారీమొత్తం చెల్లించి కొందరు ఒకటికి మించి షాపులకు దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా 290వైన్స్‌లకు గతంలో 5,215 దరఖాస్తులు రాగా ఈసారి వాటి సంఖ్య 10,730కు చేరాయి. శుక్రవారం రాత్రి వరకూ క్యూలైన్‌లో ఉండి.. మరీ పోటీపడి వ్యాపారులు దరఖాస్తు చేశబూరు. వైన్స్‌ల కోసం దరఖాస్తులు అందించిన వారి గెజిట్ నంబర్ల ప్రకారం డ్రా తీసేందుకు ఎక్సైజ్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా కలెక్టర్ల స్వీయ పర్యవేక్షణలో షాపుల వారీగా లక్కీ డ్రా తీయనున్నారు. గతం కన్నా రెట్టింపుస్థాయిలో దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. అయితే, ధరావత్తు రూ.2లక్షలు చెల్లించి దాఖలు చేసిన దరఖాస్తుదారులకు వైన్స్ దక్కకుంటే పరిస్థితి ఏమిటనే ప్రశ్న అందరిలోనూ మొదలైంది. గ్రూపుల వారీగా ఏకమై.. సిండికేట్‌గా మారి ఎవరికి వైన్స్ వచ్చినా ఉమ్మడిగా దరఖాస్తుల సొమ్ము జమచేసి షాపులు నడిపించుకుందామనే ఒప్పందానికి వచ్చారు.

290 మద్యం దుకాణాలు.. 10,730 దరఖాస్తులు

వైన్స్‌లకు అందిన దరఖాస్తులు

జిల్లా	షాపులు	గతం	ప్రస్తుతం
పెద్దపల్లి	77	1080	2,022
కరీంనగర్	94	1720	4,040
సిరిసిల్ల	48	944	2,032
జగిత్యాల	71	1471	2,636
మొత్తం	290	5,215	10,730

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని 290 మద్యం దుకాణాలకు మొత్తం 10,730 దరఖాస్తులు వచ్చాయి. గతంలో ఇవే షాపులకు 5,215 దరఖాస్తులు మాత్రమే అందాయి. గతంలో కన్నా రెట్టింపుస్థాయిలో దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

సిండికేట్‌కు సిద్ధమైన వ్యాపారులు

ఈసారి దరఖాస్తులతోపాటు రూ.2లక్షల ఫీజు చెల్లించాల్సి రావడంతో ఒక్కో బృందం బారీగా దరఖాస్తులు సమర్పించాయి. దీంతో లక్కీడ్రాపై గంటగంటకూ ఉత్కంఠ పెరిగిపోతోంది. షాపుల వారీగా డ్రా వేసి దరఖాస్తుదారులను ఏకంచేసి ఎవరికి దుకాణం దక్కినా.. అందరూ కలిసి షాప్ ఏర్పాటు చేసుకునే ఒప్పందంలో అందరూ బిజీగా ఉన్నారు.

నాలుగు జిల్లాల్లో లక్కీ డ్రా వేదికలు ఇవే..

పెద్దపల్లి జిల్లాలో..

- పెద్దపల్లి పట్టణ శివారులోని బందంపల్లి స్వరూప గార్డెన్‌లో వైన్స్‌ల లక్కీడ్రా తీసేందుకు ఎక్సైజ్ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. షాపుల వారీగా వచ్చిన దరఖాస్తులను బట్టి డ్రాలో నంబర్లు వేయనున్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ డ్రా తీసిన ప్రకారం.. షాపులు కేటాయించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 77 షాపులకు 2,022 మంది దరఖాస్తు చేయగా, వారి సమక్షంలోనే సోమవారం ఉదయం 10.30గంటల నుంచి డ్రా తీస్తారు.

కరీంనగర్ జిల్లాలో..

- కరీంగనగర్ జిల్లాలో 94 షాపులకు 4,040 దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్ గోపి ఆధ్వర్యంలో లక్కీడీప్ ద్వారా వైన్స్ కేటాయిస్తారు. ఈమేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సిరిసిల్ల జిల్లాలో..

- రాజన్న సిరిసిల్ల కలెక్టర్ ఆడిటోరియంలో లక్కీడ్రా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 48 షాపులకు 2,032 దరఖాస్తులు రాగా గెజిట్ నంబర్ల ప్రకారం కలెక్టర్ అనురాగ్ జయంతి ఆధ్వర్యంలో లక్కీడీప్ ద్వారా వైన్స్ కేటాయిస్తారు.

జగిత్యాల జిల్లాలో..

- జగిత్యాల జిల్లాలోని విరూపాక్షి గార్డెన్‌లో మద్యం షాపుల లక్కీ డ్రా తీస్తారు. కలెక్టర్ యాస్మిన్‌బాషా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఎక్సైజ్ శాఖ ఏర్పాటు చేసింది. జిల్లాలోని మొత్తం 71 షాపులకు 2,636 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారుల సమక్షంలో డ్రా తీసి దుకాణాలు కేటాయిస్తారు.

హైదరాబాద్ తరలిన కాంట్రాక్ట్ అధ్యాపకులు

రామగిరి(మంథని): హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద ఆదివారం నిర్వహించిన సామూహిక సమరదీక్షలో మంథని జేఎన్‌టీయూకు చెందిన కాంట్రాక్ట్ అధ్యాపకులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,445 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని చేపట్టిన దీక్షకు మంథని జేఎన్‌టీయూ నుంచి 40 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు తరలివెళ్లారు.



దీక్షలో అధ్యాపకులు

బల్దియాకు దోమల బెడద

ఈ ఫొటోలో కనిపిస్తున్న ఖాళీ స్థలం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) ఆవరణలోనిది. గతంలో పాలకవర్గం పార్క్ అభివృద్ధి పేరుతో కొలను ఏర్పాటు కోసం భారీ గుంట తవ్వి వదిలేశారు. ప్రస్తుతం గుంటలో వర్షం నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. మున్సిపల్, ఆస్పత్రి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో స్థానికులతో పాటు ఆస్పత్రి సిబ్బంది, ఇన్‌పేషెంట్లు ఇబ్బందులకు గురవుతున్నారు.





నగరపాలక పరిధిలోని పలు డివిజన్లలో ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఇలాంటి స్థలాలు ఎన్ని ఉన్నాయో బల్దియా అధికారులు సరైన వివరాలు చెప్పలేకపోతున్నారు. ఖాళీ స్థలాల నిర్వహణపై యజమానులు చేతులెత్తేస్తున్నారు. దీంతో అవి దోమలకు ఆవాసాలుగా మారాయి. ఖాళీ స్థలాలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శలొస్తున్నాయి.



ఇవి ధర్మాఫాగర్స్ యంత్రాలు. నగరపాలక సంస్థ రూ.4.90 లక్షలు వెచ్చించి ఏడు ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేసింది. వీటితో పాటు వాహనాల్లో అమర్చే ఫాగింగ్ మిషన్లు కూడా ఉన్నాయి. వీటిని బల్దియా ఆవరణలోని సీఆర్‌సీ భవనంలో మూలకుపడేసి తాళం వేశారు. పట్టణ ప్రజలు దోమలతో ఇబ్బందులు పడుతుంటే అధికారులు మాత్రం మొక్కుబడిగా రెండు వాహనాలతో ఫాగింగ్ చేస్తున్నారు.

- మురుగు కుంటలు.. ఖాళీ స్థలాలే ఆవాసాలు
- జ్వరం వస్తే వణుకుతున్న జనం
- మొక్కుబడిగా ఫాగింగ్
- కొరవడిన స్పెషల్ డ్రైవ్

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలికలో పగలు, రాత్రి తేడా లేకుండా పట్టణవాసుల్ని దోమలు ఎడా పెడా కుట్టేస్తున్నాయి. ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తున్నాయి. రక్తాన్ని పీల్చేసి ఆస్పత్రుల చుట్టూ తిరిగేలా చేస్తున్నాయి. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉంటే పాలకులు, అధికార యంత్రాంగం మాత్రం నీమ్మకు నిరెత్తినట్లుగా వ్యవహరిస్తుండటంపై ప్రజలు మండిపడుతున్నారు. అసలే వర్షాకాలం. సక్రమంగా ముందుకు సాగని మురుగు కాల్వలు, ఇళ్ల మధ్య ఏళ్ల తరబడి ఖాళీ స్థలాలు, సరిగా సాగని పారిశుధ్యం, మ్యాన్‌హోళ్లు.. ఇలా అనేక పరిస్థితులు దోమల వ్యాప్తికి కారణంగా మారుతున్నాయి. ఏటా దోమల నివారణకు సుమారు రూ.20లక్షలకుపైగా నిధులు వెచ్చిస్తున్నా క్షేత్రస్థాయిలో నివారణ చర్యలు చేపట్టకుండా మొక్కుబడిగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఎదురవుతున్నాయి.

నివారణ చర్యలు శూన్యం

దోమల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. మూలకు పడిన హ్యాండి ఫాగింగ్ మిషన్లకు మరమ్మతులు లేవ్. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి నీటిలో యాంటి లార్వా ఆయిల్‌బాల్స్ వేయడం లేదు. కాలవ్లలో పేరుకుపోయిన పూడిక తీయకుండా వదిలేయడంతో దోమల వృద్ధికి కారణమవుతున్నాయని విమర్శలు ఎదుర్కొంటున్నారు. బల్దియాలో సీజనల్ వ్యాధులతో చాలా మంది మంచంపడుతున్నారు. డెంగీ, మలేరియా నివారణ చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ప్రత్యేక చర్యలు తీసుకోవాలి



రామగుండం బల్దియాలో పారిశుధ్యం గాడితప్పింది. ఫలితంగా దోమలు పెరిగిపోయాయి. పగలు, రాత్రి తేడా లేకుండా కుడుతున్నాయి. దోమకాటు నుంచి బయట పడేందుకు ప్రతీ కుటుంబం నెలకు సగటున కాయిల్స్, లిక్విడ్ తదితరవాటికి రూ.300–500 వెచ్చించాల్సి రావడం బాధాకరం. అధికారులు మొక్కుబడిగా కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– బుద్దె గోవర్ధన్, వ్యాపారి, గోదావరిఖని

మాస్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తాం



దోమల నివారణకు ఎక్కడా నిర్లక్ష్యం వహించడం లేదు. ప్రత్యేక యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని అధికారులను ఆదేశించాం. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో యాంటీ లార్వా ఆయిల్‌బాల్స్ వేయాలని, బ్లీచింగ్, రసాయనాల స్ప్రే చల్లించడంతోపాటు ఫాగింగ్ చేపట్టాలని ఆదేశించాం.

– సీహెచ్.నాగేశ్వర్, మున్సిపల్ కమిషనర్

దడ పుట్టిస్తున్న విష జ్వరాలు



నందిమేడారంలో దోమల నివారణ రసాయనం పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

ధర్మారం(ధర్మపురి): వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకోవడంతో ప్రజలు విష జ్వరాల బారినపడుతున్నారు. ఈనేపథ్యంలో నెల రోజులుగా మండలంలోని కొత్తూరు, నందిమేడారం గ్రామాల్లో డెంగీ లక్షణాలతో బాధపడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతుండటంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

రెండు గ్రామాలలో ఎనిమిది కేసులు

మండలంలోని నందిమేడారం గ్రామానికి చెందిన మైథిలి అనే అమ్మాయి డెంగీతో మరణించిన విషయం తెలిసిందే. కాగా ఆమె ఇంటి సమీపంలోని మరో ఇద్దరు చిన్నారులు సిరవేని అఖిల, అంజిలకు సైతం డెంగీ లక్షణాలుండటంతో అప్రమత్తమైన కుటుంబసభ్యులు చిన్నారులిద్దరినీ కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఇదే గ్రామానికి చెందిన కొమురమ్మ డెంగీ బారినపడి కోలుకుంది. పోతురాజుల రితిక్, కొండ లచ్చయ్య జ్వరంతో బాధపడుతూ పరీక్షలు చేయించుకోగా డెంగీగా నిర్ధారణ అయ్యింది. ప్రస్తుతం వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అలాగే కొత్తూరు గ్రామంలో సాగల కొమురయ్య, బానోతు రాజేశం, బానోతు సనత్ డెంగీ బారినపడి కోలుకున్నారు.

వైద్య సిబ్బంది అలర్ట్

రెండు గ్రామాల్లో విషజ్వరాలతో పాటు డెంగీ లక్షణాలు కనిపించడంతో మేడారం పీహెచ్‌సీ వైద్యాధికారి అనుదీప్, సుష్మిత ఆధ్వర్యంలో సిబ్బంది అలర్ట్‌గా ఉంటున్నారు. వైద్య సిబ్బంది రోజూ ఆయా గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ జ్వరబాధితులను గుర్తించి చికిత్స అందిస్తున్నారు.

భయపడాల్సిన అవసరం లేదు



జ్వరం వస్తే భయపడాల్సిన అవసరం లేదు. వాతావరణంలో మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. రెండు మూడు రోజుల్లో క్రమంగా జ్వరం తగ్గుతుంది. ఇప్పటి వరకు నాలుగు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశాం. మేడారం, కొత్తూరులో డెంగీ కేసులు నమోదు కాగా వారందరూ కోలుకున్నారు.

– అనుదీప్, పీహెచ్‌సీ వైద్యాధికారి

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

జ్యోతినగర్(రామగుండం): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రామగుండం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పని చేయాలని ఎమ్మెల్యే కోరుకంటి చందర్, కార్పొరేటర్లకు దిశానిర్దేశం చేశారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండం లక్ష్మీనరసింహా గార్డెన్స్‌లో మేయర్ అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావుతో పాటు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు అంతర్గతంగా నిర్వహించుకున్న సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కార్పొరేటర్ క్షేత్రస్థాయిలో కార్యకర్తలతో కలిసి ప్రజల్లోకి వెళ్లి పనిచేయాలని సూచించారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ రామగుండం అభివృద్ధికి నిధులు కేటాయించారని వారం రోజుల్లో నిధులు రావడం జరుగుతుందని తెలిపారు. డివిజన్లలోని అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులతో చేపట్టే పనులు సెప్టెంబర్ 15 లోగా పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

బాలుడిపై వీధి కుక్కల దాడి



సైదాపూర్(హుస్నాబాద్): కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం అమ్మనగుర్తిలో ఆదివారం ఉదయం విశ్వక్(5)పై అనే బాలుడిపై వీధికుక్కలు దాడి చేశాయి. గ్రామానికి చెందిన సర్జన శ్రీకాంత్– మమతల కొడుకు విశ్వక్ పక్కింటికి పాలు తెచ్చేందుకు వెళ్లాడు. సమీపంలో గుంపులుగా తిరుగుతున్న వీధికుక్కలు బాలుడిపై దాడి చేశాయి. బాలుడి అరుపులు విని గ్రామస్తులు కుక్కలను తరిమేశారు. గాయపడిన బాలుడిని చికిత్సకోసం హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య


గొరబీ (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): మండలంలోని బుచ్చయ్యపల్లి గ్రామానికి చెందిన ఎండీ గొరబీ (80) జీవితంపై విరక్తితో గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై సత్యనారాయణ వివరాల ప్రకారం.. గొరబీకి ఇద్దరు కుమారులుండగా పెద్దకుమారుడు ఎండీ సలీం జీవనోపాధి కోసం గోదావరిఖనికి వలస వెళ్లాడు. రెండేళ్ల క్రితం సలీం అనారోగ్యంతో మరణించాడు. ప్రస్తుతం వృద్ధురాలు ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. కుమారుడు మరణించడం, ఒంటరితనం భరించలేక జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి రెండో కుమారుడు ఎండీ అలీ ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏటీఎంలో చోరీకి యత్నం



కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): కాల్వశ్రీరాంపూర్ ఎస్బీఐ ఏటీఎంలో శనివారం రాత్రి దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. ఏటీఎం బాక్స్ తెరిచి ఉండటాన్ని ఆదివారం వేకువజామున గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నారని సమాచారంతో ఆదివారం ఎన్టీపీసీ ఎస్సై జీవన్ సిబ్బందితో దాడి చేశారు. ముగ్గురు విటులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

రోడ్డుపై ఆయిల్ ట్యాంకర్ లీక్


రోడ్డుపై ఇసుక చల్లుతున్న ట్రాఫిక్ పోలీసులు


గాయపడిన మహిళ

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్ రాజీవ్ రహదారి సిగ్నల్ వద్ద ఆదివారం ఓ ట్యాంకర్ నుంచి ఆయిల్ రహదారిపై పడింది. దీంతో రెండు వాహనాలు స్కిడ్ అయి పడిపోయాయి. నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. తక్షణమే స్పందించిన ట్రాఫిక్ పోలీసులు రోడ్డుపై డివైడర్ ఏర్పాటు చేసి ఆయిల్ పడిన ప్రాంతంలో ఇసుక పోశారు. ఆదివారం వారసంత కావడంతో మేడిపల్లి సెంటర్ రద్దీగా ఉంది. తక్షణమే స్పందించి రోడ్డుపై ఇసుక పోసి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకున్న పోలీసులను ప్రజలు అభినందించారు.

లోకల్ లారీలకు అవకాశమివ్వాలి

- నిరుద్యోగుల ఉపాధిని దెబ్బతీయొద్దు
- ఐదో రోజుకు చేరిన లారీ ఓనర్ల నిరసన


లారీల ఓనర్స్ నిరసనకు మద్దతు తెలుపుతున్న రాజేందర్‌రెడ్డి

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా రైస్‌మిల్లులు ఉన్న ప్రాంతం సుల్తానాబాద్ కావడంతో ఉపాధి పొందవచ్చని పలువురు అప్పు తెచ్చి లారీలు కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఓ వివాదంతో రైస్‌మిల్లుల ఓనర్లు సిండికేట్‌గా మారి తమ ఉపాధి దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని నిరసన బాటపట్టారు. ఈనేపథ్యంలో లారీల ఓనర్ల నిరసన ఆదివారం 5వ రోజుకు చేరింది. ఈసందర్భంగా లారీ ఓనర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి దీక్షకు సంఘీభావం ప్రకటించారు. సమస్యను పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా లారీలు బంద్ చేస్తామని హెచ్చరించారు.

680 మందికి పైగా ఉపాధి

సుల్తానాబాద్ మండల పరిధిలో 154 పైగా రైస్‌మిల్లులు ఉన్నాయి. ఈనేపథ్యంలో వరి ధాన్యం, బియ్యం ఎగుమతి, దిగుమతికి లారీలు అవసరం ఉంటాయని, దీంతో ఉపాధి పొందవచ్చని పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు తదితరులు అప్పు చేసి లారీలు కొనుగోలు చేశారు. కాగా ఓ మిల్లులో సన్న వడ్ల వ్యవహారం చిలికిచిలికి గాలివానలా మారినట్లు తెలుస్తోంది. సదరు మిల్లులో సివిల్ సప్లై అధికారులు దాడులు చేయగా, ఇందుకు కారణం స్థానిక లారీ ఓనర్లే అని, రైస్‌మిల్లర్లు సిండికేట్‌గా మారి స్థానిక లారీలకు లోడింగ్, అన్‌లోడింగ్‌కు అనుమతి ఇవ్వకపోవడమే లారీ ఓనర్ల నిరసనకు కారణంగా తెలుస్తోంది. స్థానికంగా 200 వరకు లారీలు ఉండగా, ఓనర్లు, డ్రైవర్లు, క్లీనర్లు సుమారు 680 మందికి పైగా జీవనోపాధి పొందుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి లారీలను తెప్పించుకొని తమ ఉపాధిని దెబ్బతీస్తున్నారని ఆరోపిస్తున్నారు.

సమస్యను పరిష్కరించాలి

స్థానిక లారీల ఓనర్లను రైస్‌మిల్లర్లు చర్చలకు ఆహ్వానించాలని లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి సూచించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌తో పాటు ఎంవీఐ, రెవెన్యూ, పోలీస్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని, సమస్యను పరిష్కరించి స్థానికులకు ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా లారీలను సుల్తానాబాద్ మండలానికి రానివ్వమని, పూర్తిగా నిలుపుదల చేస్తామని తెలిపారు.

చర్చలకు పిలవాలి



లారీ ఓనర్‌లను రైస్‌మిల్లర్లు చర్చలకు పిలవాలి. స్థానికుల ఉపాధిని దెబ్బతీయకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలి. ఉపాధికోసం అప్పు చేసి లారీలు కొన్నాం. 20 రోజుల నుంచి పనులు లేక ఇబ్బందులు పడుతున్నాం.

– కంకణాల తిరుపతి, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, సుల్తానాబాద్

స్థానికుల ఉపాధిని దెబ్బతీయకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

మంథనిలో దొంగతనం


గాయపడ్డ జయప్రద


బీరువా తలుపులు తెరిచి ఉన్న దృశ్యం

మంథని: మంథని పట్టణం రావులచెరువుకట్ట వీధిలో నివాసముండే పాపిట్ల జయప్రద అనే వృద్ధురాలిపై ఈ నెల 18న దుండగులు దాడి చేసి ఇంట్లో ఉన్న ఆరు తులాల బంగారం, 40 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు ఎస్ఐ కిరణ్ తెలిపారు. ఎస్ఐ, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. క్యాటరింగ్ పని చేసే పాపిట్ల సంతోష్ ఈ నెల 18 రాత్రి 9.30 గంటలకు పని నిమిత్తం మంథని నుంచి హైదరాబాద్ వెళ్లాడు. ఇంట్లో అతడి తల్లి జయప్రద ఉన్నారు. అదే రోజు అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో బాత్రూంకు వెళ్లగా నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి ఆమెపై విచక్షణరహితంగా దాడి చేశారు. ముఖంపై దాడి చేసి ముక్కుపుడకలు, ఇంట్లో బీరువాలో ఉన్న జత కమ్మలు, ఐదు తులాల బంగారు నక్లెస్, 40 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. అయితే దొంగలు దాడి చేసి సొత్తు ఎత్తుకెళ్లిన తర్వాత సదరు వృద్ధురాలు భయంతో తలుపులు వేసుకొని ఇంట్లోనే ఉండిపోయింది. ఆదివారం సంతోష్ తిరిగి వచ్చేసరికి ముఖం కమిలిపోయి గాయాలతో ఉండడంతో హైరానా చెందాడు. తల్లిని వాకబు చేయగా విషయం తెలియజేసింది. పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలాన్ని పరిశీలించారు. సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాంట్రాక్ట్ ఉద్యోగిపై వేటు

- తప్పించుకున్న అధికారులు
- ఉద్యోగం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న బాధితుడు

ధర్మారం(ధర్మపురి): నిబంధనలకు విరుద్ధంగా మామిడితోటలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి సమీపంలో నూతనంగా విద్యుత్ లైన్ వేసిన అధికారులపై చర్యలు తీసుకోకుండా కాంట్రాక్టు ఉద్యోగిపై వేటువేసిన ఘటన ధర్మారం మండలం మల్లాపూర్ విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. మండలంలోని కమ్మరిఖాన్‌పేట గ్రామంలో ఓ వ్యక్తికి చెందిన మామిడితోటలో నుంచి దాదాపు 15 విద్యుత్ స్తంభాలతో లైన్ ఉంది. మామిడి చెట్లపై నుంచి వైర్లు ఉండటంతో గాలి వీచిన ప్రతిసారి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజు పోవడంతో పాటు తరచూ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయేది. దీంతో అప్పటి లైన్‌మెన్ మామిడిచెట్లను తొలగించాలని లేదా షిఫ్టింగ్ చార్జీలు చెల్లిస్తే స్తంభాలను తోట పక్కనుంచి లైన్ వేస్తామని సదరు రైతులకు వివరించారు. రైతులతో పలుసార్లు మాట్లాడిన సదరు ఉద్యోగికి తోటలో నుంచి విద్యుత్ స్తంభాలను తొలగించుటకు అంగీకారం కుదిరినట్లు సమాచారం. ఈ క్రమంలోనే గతేడాది మార్చిలో ఎలాంటి షిఫ్టింగ్ అనుమతులు లేకుండానే తోటలో నుంచి విద్యుత్ స్తంభాలను శ్రీరాంసాగర్ ప్రాజెక్టు డీ–83 కెనాల్ రోడ్డు సరిహద్దు నుంచి వేసేందుకు సదరు ఉద్యోగి పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఇదే గ్రామంలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్న సంతోష్‌నాయక్‌ను ఈ పనిలో భాగస్వామిని చేశారు. అయితే స్తంభాలు వేసిన తర్వాత లైన్ వేస్తున్న క్రమంలో వైర్ల కింద హరితహారం చెట్లను జేసీబీతో తొలగించారు. ఈ విషయమై అదే గ్రామానికి చెందిన వ్యక్తులు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఎంపీడీవో విద్యుత్ అధికారులపై సీఎండీకి ఫిర్యాదు చేశారు. దీంతో సీఎండీ విచారణకు ఆదేశించారు. విచారణలో నిబంధనలకు విరుద్ధంగానే లైన్ షిఫ్టింగ్ చేసినట్లు తేలింది. అయితే లైన్ షిఫ్టింగ్ చేసిన లైన్‌మెన్‌తో పాటు అప్పటి సంబంధిత ఏఈ స్థాయి అధికారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కాంట్రాక్టు ఉద్యోగి సంతోష్‌నాయక్‌ను విధుల నుంచి తొలగించారు. ఈ ఘటనతో తనకు ఎలాంటి సంబంధం లేకున్నా తొలగించారని, ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్నా తనకు న్యాయం జరుగడం లేదని బాధితుడు వాపోయాడు. ఉన్నతాధికారులు స్పందించిన తిరిగి ఉద్యోగంలోకి తీసుకావాలని సంతోష్‌నాయక్ కోరారు. ఈ విషయమై అప్పటి ఏఈ రాజేంద్రప్రసాద్‌ను వివరణ కోసం ఫోన్‌లో ప్రయత్నించగా స్పందించలేదు.

యువకుడి ఆత్మహత్య


శ్రావణ్ (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూమారేడుపాక గ్రామానికి చెందిన దుర్గం శ్రావణ్(24) బొగ్గు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గోదావరిఖని టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. శ్రావణ్ స్వగ్రామం అంతర్గాం మండలం ముర్మూర్. చిన్నప్పటి నుంచి న్యూమారేడుపాక గ్రామంలో తన పెద్దనాన్న సింగరేణి రిటైర్డ్ కార్మికుడు దుర్గం బుచ్చయ్య ఇంటి వద్ద ఉండి చదువుకున్నాడు. ఈఏడాది జూన్‌లో హైదరాబాద్‌లోని బీహెచ్ఈఎల్‌నందు వెల్డర్‌గా అప్రెంటిస్ ట్రెనింగ్ పూర్తిచేశాడు. తరుచూ మద్యం సేవించేవాడు, వారం రోజుల క్రితం తన తల్లి, చెల్లెను చూసేందుకు ముర్మూర్ వెళ్లి వచ్చిన శ్రావణ్ ఈనెల 19న రాత్రి బయటకు వెళ్లి వస్తానని చెప్పి రాలేదు. ఆదివారం ఉదయం ఎన్టీపీసీ నుంచి సైలో బంకర్‌కు వెళ్లే బొగ్గు రైల్వే ట్రాక్‌పై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుని మృతిచెందినట్లు తెలిపారు. కాగా శ్రావణ్ ఆత్మహత్యకు ప్రేమవిఫలం కారణం కావచ్చని ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడి పెద్దనాన్న బుచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ వేణుగోపాల్, ఎస్సై ఫరీద్ తెలిపారు.



పోటెత్తిన భక్తులు

కమాన్‌పూర్(మంథని): మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన శ్రీఆదివరహస్వామి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం సందర్భంగా పలు ప్రాంతాల నుంచి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు.



అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో అగ్రగామి

- మహారాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే జగదీశ్‌సిన్హాపాటిల్


మాట్లాడుతున్న జగదీశ్‌సిన్హాపాటిల్

గోదావరిఖని(రామగుండం): దేశంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ప్రధాని నరేంద్రమోడీ సారథ్యంలో బీజేపీ ప్రభుత్వానికే దక్కుతుందని మహారాష్ట్ర ఎమ్మెల్యే రానా జగదీశ్‌సిన్హాపాటిల్, మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన పార్టీ నియోజకవర్గస్థాయి సమావేశంలో మాట్లాడారు. మూతపడ్డ ఆర్ఎఫ్‌సీఎల్‌ను తెరిపించిది ప్రధాని మోడీ అని, సింగరేణి బొగ్గు గనుల్లో 49శాతం పెట్టుబడి పెట్టారన్నారు. రామగుండం రైల్వే బ్రిడ్జి, రామగుండం రైల్వేస్టేషన్ ఆధునీకరణ కోసం రూ.26.50కోట్లు కేటాయించారని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉంటున్న మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులు కంకణబద్దులు కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రామచందర్, సోమారపు లావణ్య, దుబాసి లలిత, కుసుమకుమారి, కోదాటి ప్రవీణ్, జనగామ రాజలింగం, పత్తి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ చూపు సజీవం


శంకరమ్మ(ఫైల్)

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): ఆ అమ్మ మరణించినా చూపు మాత్రం సజీవంగానే ఉంది. తాను మరణిస్తూ ఇద్దరు అంధులకు వెలుగులు ప్రసాదించింది. రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురంకు చెందిన శంకరమ్మ(85) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె నేత్రాలను ఐ బ్యాంక్‌కు దానం చేస్తే మరో ఇద్దరికి చూపును ప్రసాదించవచ్చని కుటుంబ సభ్యులకు, సదాశయ ఫౌండేషన్ సభ్యుడు బూర్ల శ్రీనివాస్ అవగాహన కల్పించారు. విషాదంలో కూడా తల్లి నేత్రాలు దానం చేయడానికి కొడుకులు, కోడళ్లు కొమురయ్యరాజేశ్వరి, కుమారస్వామిదేవేంద్ర, నాగరాజువిజయలక్ష్మి, కూతురు, అల్లుడు తన్నీరు దేవేంద్రప్రభాకర్ ముందుకు వచ్చారు. టెక్నీషియన్ ఆరిఫ్ ద్వారా శంకరమ్మ నేత్రాలను సేకరించి, హైదరాబాద్ వాసన ఐ బ్యాంక్‌కు తరలించారు. ఈసందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు టి.శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, జిల్లా అధ్యక్షుడు భీష్మాచారి, ప్రతినిధులు కేఎస్ వాసు, అన్నపూర్ణ, రాజమౌళి, మారెల్లి రాజిరెడ్డి, చంద్రమౌళి, చారి, అనంతరాములు, లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు తానిపర్తి విజయలక్ష్మి, కళావతి, మనీషా, బెజిగోపాల్ త్రివేది తదితరులు అభినందించారు.

పథకాల పేరిట మోసం చేస్తున్న సీఎం కేసీఆర్

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రవీణ్‌కుమార్, ఉష

పెద్దపల్లిరూరల్: తెలంగాణ ప్రజలకు సీఎం కేసీఆర్ ఇదిగో అదిగో అంటూ ఆశ చూపి మోసపూరిత పాలన సాగిస్తున్నారని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. పెద్దపల్లిలో ఆదివారం బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ఆధ్వర్యంలో ఎంఐఎం పార్టీకి చెందిన కౌన్సిలర్ కార్తీక్ బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా కార్తీక్‌కు బీఎస్పీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కులాలు, వృత్తుల వారీగా ప్రజల్లో ఆశలభ్రమలను కల్పించి పథకాలను వర్తింప జేస్తామంటూ మోసపూరితమైన పాలనను సాగిస్తున్నాడన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడాలని ప్రజలంతా నిర్ణయించుకున్నారన్నారు. బహుజనులంతా ఏకమైతే అధికారం సాధించడం కష్టమేమీ కాదన్నారు. బీఎస్పీ విధానాలకు ఆకర్షితులై ఎంఐఎం పార్టీకి రాజీనామా చేసి బీఎస్పీలో చేరిన కౌన్సిలర్ కార్తీక్‌తో పాటు సతీష్, సాగర్, సిద్దిఖ్, సమీర్, అర్బాజ్, మొయిన్, షానవాజ్ లను అభినందించారు. నాయకులు దాసరి హనుమయ్య, రియాజ్, అజీం, సాధిక్ తదితరులున్నారు.

గ్యాంగ్‌రేప్ ఘటనను నీరుగార్చొద్దు

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేశ్‌రెడ్డి


మాట్లాడుతున్న సురేశ్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అప్పన్నపేట శివారులో వలసకూలీ కుటుంబానికి చెందిన మైనర్ బాలికపై సామూహిక అత్యాచారం జరిగిందన్న పోలీసులు ఇప్పుడు మాటమార్చి ఆత్మహత్య చేసుకుందని చెప్పడం వెనక ఉన్న ఆంతర్యమేంటని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం పెద్దపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పొరుగు రాష్ట్రం నుంచి పొట్టకూటి కోసం వచ్చిన వలస కూలీ కుటుంబానికి చెందిన బాలిక సామూహిక అత్యాచారానికి గురై మరణించిన ఘటనపై పోలీసులు అనుసరిస్తున్న తీరు అనుమానంగా ఉందన్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను లీక్ చేసి తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తున్నట్టుగా ఉందన్నారు. కేసును ఆత్మహత్యగా మార్చి దోషులను కాపాడితే తాము న్యాయపోరాటానికి సిద్ధమన్నారు. అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకులు ఈ ఘటనపై మాట్లాడకపోవడం వారి నీచ రాజకీయానికి పరాకాష్టగా పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు వునుకొండ శ్రీధర్, తిరుపతి, కందునూరి ప్రమోద్‌కుమార్, తూముల రవితేజ, ఫయాజ్, మోసంపల్లి శ్రీధర్, మోర మనోహర్, శ్రీనివాస్, వేణు, కుమార్, అనిల్, ప్రవీణ్‌సింగ్ తదితరులున్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి బైఠాయింపు

ముత్తారం(మంథని): ఒక్కటే ఊరు.. పక్కపక్కనే ఇళ్లు.. ఒకరినొకరు చిన్నప్పటి నుంచి ఇష్టపడ్డారు. పెళ్లి చేసుకుందామనుకున్నారు. ఇంట్లో వారి ఒత్తిడితో ప్రియురాలికి పెళ్లి అయ్యింది. అయినా వారి ఇద్దరి మధ్య ప్రేమ తగ్గలేదు. పెళ్లి చేసుకుంటానని నమ్మబలకడంతో కట్టుకున్న భర్తకు విడాకులు ఇచ్చింది. రేపుమాపు పెళ్లి చేసుకుంటానని చివరకు ముఖం చాటేయడంతో ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు ఆందోళనకు దిగిన ఘటన ఆదివారం ముత్తారం మండలం రామకృష్ణాపూర్(ఇప్పలపల్లి)లో జరిగింది. బాధితుల వివరాలు.. గ్రామానికి చెందిన రజిత, విద్యాసాగర్ ఒకరినొకరు ప్రేమించుకున్నారు. రజితకు వేరే వ్యక్తితో వివాహం కాగా సాగర్ పెళ్లి చేసుకుంటానని ఒత్తిడితో విడాకులు ఇచ్చింది. అప్పటి నుంచి రజిత తల్లిగారింట్లో ఉంటుంది. కొంతకాలం తర్వాత పెళ్లి చేసుకోవాలని విద్యాసాగర్‌ను పలుమార్లు నిలదీసింది. ముత్తారంలోని పీఏసీఎస్‌లో తాత్కాలిక ఉద్యోగం చేస్తున్న తనకు శాశ్వత ఉద్యోగం అయ్యే వరకు వేచి ఉండాలని కొంతకాలం గడిపాడు. తర్వాత వాయిదాలు వేస్తూ రావడంతో పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీ జరిగింది. అయినా ససేమిరా అనడంతో రజిత ప్రియుడి ఇంటి ముందు బైఠాయించింది. ఆమెను చూసిన సాగర్ పరారయ్యాడు. ఎస్సై రాణి ఘటన స్థలానికి చేరుకొని రజితకు కౌన్సెలింగ్ చేశారు. న్యాయం చేస్తానని నచ్చచెప్పడంతో ఎట్టకేలకు ముత్తారం పోలీస్‌స్టేషన్ వెళ్లింది. సాగర్‌ను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ చేస్తామని ఎస్సై తెలిపారు.

నవసమాజ నిర్మాణమే లక్ష్యం


మాట్లాడుతున్న మన్మోహన్

జ్యోతినగర్(రామగుండం): నవ సమాజ నిర్మాణమే లక్ష్యంగా విద్యార్థుల రాజకీయ పార్టీ ముందుకు సాగుతుందని ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు తమ్మెర మన్మోహన్ అన్నారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లోని కార్యాలయంలో మాట్లాడారు. యువతకు ఉపాధి కల్పించే దిశగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సర్ సంస్థను స్థాపించి జాబ్‌మేళాలు ఏర్పాటు చేసి సుమారు 400 మందికిపైగా ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించామని వివరించారు. రామగుండంలో మొట్టమొదటిసారిగా ఉద్యోగ భవన్‌ను ప్రారంభించి ఎవరికి ఉద్యోగం కావాలన్నా కార్యాలయంలో బయోడేటా అందిస్తే అర్హతలకు తగిన ఉద్యోగాలు ఇప్పించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు కార్పొరేషన్‌లోని 50 డివిజన్లలో పాదయాత్ర చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి చేసేందుకు కనీస విద్యార్హత డిగ్రీ ఉండాలని, విద్యావంతులు రాజకీయాల్లోకి వస్తేనే దేశ పురోగతి సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో క్రాంతికుమార్, బి.శ్రీనివాస్, ఫిరోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

‘డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పంపిణీ ఊసెత్తని సర్కార్’


వెన్నంపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఉష

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): పేదల పక్షపాతిగా గొప్పలు చెబుతున్న తెలంగాణ సర్కార్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీపై ఊసెత్తడంలేదని, ప్రారంభించకుండానే పాడుబడి పోతున్నాయని బీఎస్పీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ఆరోపించారు. ఆదివారం మండలంలోని వెన్నంపల్లి, కూనారం గ్రామంల్లో మన ఊరు– మన ఉషక్క కార్యక్రమంలో పాల్గొన్నారు. రాబోయే ఎన్నికల్లో తనకు మద్దతు తెలుపుతూ ఎన్నికల అవసరాల కోసం పార్టీ అభివృద్ధికి విరాళాలు ఇవ్వాల్సిందిగా ఇంటింటికీ వెళ్లి అభ్యర్థించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వందల కోట్ల అభివృద్ధి పనులు చేశామంటూ హడావిడి చేయడం హాస్యాస్పదమన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ప్రజలను మోసం చేసే ప్రయత్నం తప్ప ఇంకేమీలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఎస్పీకి అండగా నిలబడి గెలిపించుకుంటామని ప్రజలు ఆశీర్వదిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు కుమ్మరికుంట రవికుమార్, మహిళా అధ్యక్షురాలు శారద, జిల్లా నాయకులు రియాజ్, రాహుల్, బొంకూరి దుర్గయ్య, నార్ల గోపాల్, నాయకులు రంజిత్, అశోక్, చంద్రశేఖర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

‘మంథని మధుకర్ కేసులో నిందితులను శిక్షించాలి’



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

మంథని: మంథని మధుకర్ మృతి కేసులో నిందితులను శిక్షించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మంథనిలో మధుకర్ తల్లిదండ్రులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మంథని మండలం ఖానాపూర్ గ్రామంలో నిరుపేద ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మధుకర్‌ను 2017లో హత్య చేసి ఆత్మహత్యగా కొంత మంది అధికారులు చిత్రీకరిస్తున్నారని, దీనిని ఖండిస్తున్నట్లు తెలిపారు. ఆత్మహత్య చేసుకుంటే అతడి శరీరంపై గాయాలు ఎందుకు ఉంటాయని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి దళితలపై ప్రేమ ఉంటే నిందితులను గుర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మధుకర్ తల్లిదండ్రులు లచ్చయ్య, ఎల్లమ్మ, అన్న సమ్మయ్య, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కందుకూరి రాజరత్నం, సీపీఐ సీనియర్ నాయకుడు కొవ్వూరి రాజలింగు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరెపల్లి మానస్ తదితరులు ఉన్నారు.

మల్లన్నకు పట్నం మొక్కులు

ఓదెల(పెద్దపల్లి): శ్రావణమాసం సందర్భంగా ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారికి పట్నాలు, బోనం మొక్కులు చెల్లించుకున్నారు. కాగా స్వామివారి సన్నిధిలో దేవాదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో గజవెల్లి వెంకన్న బృందంచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, శశిరేఖ పరిణయం, చిందు యక్షగానం కథలు ఆకట్టుకున్నాయి.

